CC-O. In Public Domain. Digitized by eGangotri

శ్రీ శంకర కృప

దక్షిణామ్నాయ

శ్రీ శృంగేరీ శారదా పీఠము వారి యాజమాన్యమున వెలువడు

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి	వెల రూ॥ 1-50 ఫిబ్రవరి 1980	సంచిక
29	సం॥ చందా రూ॥ 15/- ఱు	6

శుక్లనామ సంవత్సర మాఘ - ఫాల్గుణ (శకాబ్ది ౧౯౦౧)



చాతుర్మాస్య వ్రతదీక్ష స్వీకరణోత్సవ వ్యాసపూజ శ్రీ జగద్గురు
భారతీతీర్థ మహాస్వాములవారు

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

శ్రీ జగద్గురు భారతీతీర్థ మహాస్వామి చరణుల వార్షిక వర్ధంతి

ఆస్తికజనుల పట్ల దయాభావముతో సనాతన ధర్మ సంరక్షణకై శ్రీ శంకర భగవత్పాదులు చతురామ్నాయ పీఠములను స్థాపించిరి. అందు 'తస్య యజుర్వేద శిరః' అను శ్రుతి ప్రమాణముచే శిరఃప్రధాన పీఠమై అవిచ్ఛిన్న గురు పరంపరా విద్యమానమై దక్షిణామ్నాయ శ్రీ శృంగేరీ శారదాపీఠము ప్రకాశించు చున్నది. శ్రీ శృంగేరీ జగద్గురువులను శ్రీ శంకర భగవత్పాదులుగానే భావించి సేవించవలెనని మతామ్నాయ శాసనము స్పష్టంచేసినది. అందువలని శ్రీ జగద్గురువుల పట్ల కృతజ్ఞతాభావాన్ని ప్రదర్శించుట మన కర్తవ్యము.

ప్రస్తుతము శ్రీ శృంగేరీ పీఠమును తేజోభరితము చేయుమన్న శ్రీ జగద్గురు భారతీతీర్థ మహాస్వామి చరణులకు ప్రమోదనామ సంవత్సర చైత్ర మాస శు. షష్ఠి ఆదివారము (1-4-1990) 40వ జన్మదిన మగుచున్నది. శ్రీ చరణులు 38వ పీఠాధిపతిగా వ్యాఖ్యాన సింహాసనాన్ని అక్టోబరు 19, 1989 నాడు అధిరోహించిరి. తదనంతరం వచ్చిన మొదటి జన్మదిన మిది. ఆనాడు శ్రీ శంకరకృప పాఠకుల తరపున శ్రీ చరణులకు యథాపూర్వముగా పాద పూజ చేయబడును. పాఠకులు తమ తమ విరాళములను (రూ. 10/- లకు తక్కువ కాకుండా) ప్రకాశకుని చిరునామాకు పంపగోరుచున్నాము.

యమ్.వి. శేషగిరిరావు
శ్రీ శంకరకృపా ప్రకాశకులు
1-2-1130/19/1,
న్యూ వల్లకుంట, హైదరాబాదు-44

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

శ్రీ శంకర కృప

దక్షిణామ్నాయ

శ్రీ శృంగేరీ శారదా పీఠము వారి యాజమాన్యమున వెలువడు

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపాదకుడు : టి. హరిహరశర్మ

సంపుటి 29	శంకర శ్శంకర స్సాక్షాత్ వ్యాసో నారాయణో హరిః	సంచిక 6

శ్రీ శంకర భగవత్పాదాచార్య విరచిత

సౌందర్యలహరి

శ్లో॥ తవాజ్ఞా చక్ర స్థం తపన శశికోటి ద్యుతిధరం
పరం శంభుం వన్దే పరిమిళిత పార్శ్వం పరచితా
యమారాధ్య న్భక్త్యా రవి శశి శుచీనా మవిషయే
విరాలోకేఽలోకే వి వసతి హిమాలోక భువనే.

తాత్పర్యము : అమ్మా ! నీ ఆజ్ఞా చక్రము నందుకోటి సూర్యచంద్రుల కాంతులతో ప్రకాశించుచు ఎడమ భాగమున నీ యొక్క చిద్రూపమును ధరించు చున్న పరమ శివుని గుర్తించి యెవఁడు ధ్యానించునో అట్టి మానవుఁడు రవి చంద్రులు గానని సంతోషసముద్రమున నోలలాడుచు ముక్తిని గాంచు చున్నాఁడు.

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

శ్రీ జగద్గురు అభినవ విద్యాతీర్థ మహాస్వామి చరణుల ఉపదేశము

జాగ్రదవస్థ స్వప్నావస్థ నుండి భిన్నంకాదు. అంటే ఉన్నతస్థాయి నుండి ఆలోచించినప్పుడు. ఈ అవస్థలన్నీ మనస్సు కల్పించుకున్నవే. స్వప్నావస్థలో స్వప్న జగత్తు వాస్తవమే అనిపిస్తుంది. అలాగే జాగ్రదవస్థలో ఈ ప్రపంచమూ వాస్తవమే అనిపిస్తుంది. సుఖ దుఃఖాలను మనం జాగ్రదవస్థలో అనుభవిస్తూ ఉన్నాం. ఆలాగే స్వప్నావస్థలోనూ.

జాగ్రదవస్థలో ఒక పుస్తకాన్ని మేజాపై పెట్టి మరో పనిమీద వేరొక ప్రదేశానికి వెళ్ళి, కొంతసేపు అయిన తరువాత తిరిగి వస్తే ఆ పుస్తకం ఆ మేజా మీదే కనపడ్తోంది. కాని స్వప్నావస్థలో మేజా మీద పెట్టిన పుస్తకం జాగ్రదవస్థలో కనపడటం లేదు. అందువలన ఈ రెండు అవస్థలలో లేదా ఉందనీ, జాగ్రదవస్థ వాస్తవమనీ వాదించే వారున్నారు. కాని వాదనలో పటుత్వం లేదు. జాగ్రదవస్థలో మేజాపై పెట్టిన పుస్తకాన్ని జాగ్రదవస్థలోనే చూస్తున్నారు. కాని స్వప్నావస్థలో పెట్టిన పుస్తకాన్ని జాగ్రదవస్థలో చూడాలంటున్నారు. అలా కాకుండా, స్వప్నంలో మేజాపై పుస్తకాని పెట్టి స్వప్నంలోనే చూస్తే పుస్తకం కనబడుతూనే ఉంటుంది. జాగ్రదవస్థలో కనపడిన పుస్తకం స్వప్నంలో కనపడటం లేదు. అలా గని స్వప్నమే వాస్తవం అని చెప్పలేం కదా!

అయితే నిద్రిస్తున్న మనల్ని కొందరు చూస్తున్నారు. మనం నిద్రపోతున్నట్లు వారు చెప్తున్నారు కాబట్టి స్వప్నం అవాస్తవం అని చెప్పవచ్చు కదా. అని ప్రశ్నించేవారున్నారు. అయితే మనం గమనించవలసిన విషయం మరొకటుంది. స్వప్నంలో మనల్ని మనమే చూస్తున్నాం. చాలా విషయాల గురించి ఆలోచిస్తున్నాం. మన స్వప్నంలో కూడ ఇతరులు మనల్ని చూస్తున్నారు. అది వాస్తవమా? అవాస్తవమా? స్వప్నావస్థ గురించి మనం ఏమి చెప్తామో, జాగ్రదవస్థ గురించీ అదే చెప్పాలి.

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

జాగ్రదవస్థ కొన్ని సంవత్సరాలుంటే, స్వప్నావస్థ కొన్ని గంటలో, నిమిషాలో ఉంటోంది కదా అని సందేహించేవారూ ఉన్నారు. కాని వారి ధోరణిలో ఆలోచిస్తే ముప్పది నిమిషాల పాటు ఉండే స్వప్నం పది నిమిషాలుండే స్వప్నం కన్నా వాస్తవమైంది. అనాల్సి వస్తుంది. ఎంతసేపు ఉన్నా స్వప్నం స్వప్నమే అందువలన ఎక్కువసేపు ఉంటుంది కాబట్టి జాగ్రదవస్థ వాస్తవమనీ, తక్కువ సేపు ఉండే స్వప్నావస్థ అవాస్తవమనీ చెప్పలేం. కాలగణన కూడ మానసిక మైన కల్పనే. స్వప్నంలో గంట అనిపించిన సమయం జాగ్రదవస్థ దృష్ట్యా పది నిమిషాలే కావచ్చు. జాగ్రదవస్థ యొక్క కాలపరిమితి దీర్ఘమని చెప్పటం తప్ప. స్వప్నావస్థలో కాని జాగ్రదవస్థలో కాని కాంగణన మనస్సు ఏర్పరుచుకున్న కల్పనల ఆధారంగానే జరుగుతోంది.

జాగ్రదవస్థలో మనం అనుభవించిన విషయాలు వాస్తవం కాదు అనే సంగతి మనం తెలుసుకోలేక పోతున్నాం. దానికి కారణం జాగ్రత్తగా ఆలోచిస్తే అర్థమవుతుంది. మనం నిద్రపోతున్నప్పుడు వచ్చిన స్వప్నంలో కలిగిన అనుభూతి నిజంకాదని అప్పుడు తెలియదు. స్వప్నంలో స్వప్నం నిజం కాదని తెలియదు కదా! స్వప్నం పూర్తయిన తరువాత అది అవాస్తవమని గ్రహిస్తున్నాం. అలాగే మాయచే నిర్మితమైన ఈ పెద్ద స్వప్నంలో మనం ఉన్నాం. కల చెదరిన తరువాత ఈ ప్రపంచమంతా నిజం కాదని గ్రహిస్తాం. జ్ఞానం లభించిన తదుపరి, సచ్చిదానంద స్వరూపమైన/ ఆత్మయొక్కటే సత్యమనీ, అది ఎటువంటి బంధాలూ, లేనిదనీ గ్రహించిన తదుపరి, ఈ కల చెదిరిపోతుంది.

'ఈ సమస్తానికి సాక్షి అయిన ఆత్మను' అనెడి భావన కలిగినప్పుడే జ్ఞానం లభిస్తుంది. పరిశుద్ధమైన మనస్సుతో ఈ ప్రపంచం అసత్యమనెడి ఆలోచనతో జ్ఞానాన్ని సంపాదించుకోవాలి.

శాస్త్ర బోధనం కనుగుణంగా, గురూపదేశం ద్వారా తత్త్వజ్ఞానాన్ని పొందవచ్చు. ఆయితే శాస్త్రాలు, గురువూ కూడ అసత్యమైన ఈ ప్రపంచానికి చెందినవారే కదా అనెడి సందేహం కలుగవచ్చు. అయినా తత్త్వజ్ఞానం పొందవచ్చు. కలలో పులి మనవెంట పడిందని అనుకుందాం, భయంతో మనం నిద్ర

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

నుంచి మేలుకుంటాం. అలాగే శాస్త్రాలు, గురువూ మనల్ని ఈ కలనుండి లేపవచ్చు. ఇతర వస్తువులున్నాయనేది దృష్టి సృష్టికి కారణం. అందువలన అన్యవస్తువుల గురించి ఆలోచించటమూ వృధాయే.

ఈశ్వరుడు కూడా స్వప్నంలో భాగమే. వాస్తవానికి కార్యమూలేదు. కారణమూలేదు. బంధమున్నదనుకున్నంత వరకే బంధముంటుంది. స్వేచ్ఛ ఉన్నదనుకుంటే స్వేచ్ఛ ఉంటుంది. అందువలననే 'ముక్తాభిమానీ ముక్తోహి బంధో బంధాభిమాన్యాపి' అన్నారు ముక్తుడననుకుంటే ముక్తుడు. బంధమున్నదనుకుంటే బంధముంటుంది.

బంధమున్నదనుకనే తప్పుడు ఆలోచనను తొలగించటమే మోక్షప్రాప్తికి సులభమార్గం. దృష్టి-సృష్టి వాదాన్ని ఆధారం చేసుకుని నేను ఇంతవరకు కొన్ని విషయాలు చెప్పాను. అయితే ఈ వాదాన్ని గ్రహించటం అందరికీ సాధ్యం కాదు. అందుకు అవసరమైన మానసిక పరిపక్వత ఉండదు స్వప్నావస్థ అసత్యమని గ్రహించగలరు. జాగ్రదవస్థ కూడ అసత్యమని చెప్పినప్పుడు ఆందోళనకు గురువుతారు. 'జాగ్రదవస్థ స్వప్నావస్థ ఒక విధమైనవే' అని చెప్పినందున కొంతమంది స్వప్నావస్థను కూడ సత్యమే అని భావించవచ్చు. అందువలననే శాస్త్రాలు దృష్టి-సృష్టి వాదం గురించి ఎక్కువగా మాట్లాడవు.

మనవి

శ్రీ శంకరకృప యందు గ్రంథములు సమీక్షింపబడవలెనన్న రెండు కాపీలు సంపాదకునికి దిగువ చిరునామాకు పంపవలెను. వీలైనంత త్వరలో సమీక్షింపబడును.

టి. హరిహరశర్మ
సంపాదకుడు, శ్రీ శంకరకృప
199/3RT విజయనగరకాలనీ,
హైదరాబాదు - 500 457

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

శ్రీజగద్గురు భారతీతీర్థ మహాస్వామి చరణుల ఉపదేశము

(గత సంచిక తరువాయి)

చదుకునేటప్పుడు మరోవ్యాపకం ఉండ కూడదనే వారు గురుపాదులు. "ఆలా మరో విషయంపట్ల ఆకర్షితుడవైతే నిన్ను పండితుడిగా చేయటం చాలా కష్ట" అనేవారు. తమ ఆచార్యులైన శ్రీ చంద్రశేఖర భారతీ మహాస్వామి వారి గురించి చెప్తూ "మేము ఒకక్షణం చదవకపోయినా ఊరుకునే వారు కాదు" అనే వారు.

ఈ విధంగా తమ అనుభవాలను ఉదహరిస్తూ, ఎలా నడచుకోవాలో, మఠ సంప్రదాయాలను ఎలా పాటించాలో, శిష్యులతో ఎలా వ్యవహరించాలో బోధిస్తూ ఉండేవారు. సందర్భం వచ్చినప్పుడు ఎవరు ఎటువంటివారో వివరించే వారు. అయితే ఎవరి ప్రవర్తన ఎలా ఉన్నా, ఆందరిపట్ల సానుభూతితో, అభిమానంతో దయతో వ్యవహరించాలని చెప్పేవారు. ఎవరికీ కూడ మనకు వారిపట్ల అయిష్టత ఏర్పడిందనే భావన కలుగ కూడదనే వారు.

దశరథుని ప్రవర్తన గురించి కాళిదాసు ఇలా వర్ణించాడు. 'అహమేవ మతోమహీపత్యే రితి సర్వాః ప్రకృతి శ్చింతయత' అతని రాజ్యంలో ఎవరికి వారు మహారాజుకు తామంటే అత్యంత ప్రీతి అనుకునే వారట. దశరథ మహారాజు ప్రవర్తన అలా ఉండేది. ఆచార్యపాదులు ఇలా చెప్పేవారు. "స్వాములూ! దశరథుని కాలంలోనో, కాళిదాసు కాంలోనూ అది సమంజసం కాని మన కాలంలో కుదరదు ఆని అనుకోకూడదు. వాస్తవానికి ఈనాడు కూడ అది నిజమే." ఆ విధంగా అనేక విషయాలను బోధిస్తూ మాకు తమ ఆశీస్సులం నందించారు.

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

మరో ఆశ్చర్యకరమైన విషయం నాకు స్ఫురిస్తోంది. ఆచార్య పాదులు 1931 లో సన్న్యాసాశ్రమాన్ని స్వీకరించారు. వారి గురుపాదులతో 1954 వరకు అంటే 23 సంవత్సరాలు తాము పీఠాధిపతి అయ్యేవరకు గడిపారు. అవిచ్ఛిన్నగురు పరంపరలో వారు 35 వ పీఠాధిపతి. 35 సంవత్సరాలు పీఠాధిపతి బాధ్యతలను నిర్వహించారు. ఇదేమి ఈశ్వర సంకల్పమో!

ఈ 35 సంవత్సరాలలో పీఠాభివృద్ధికై వారు ఆమలుచేసిన పనులను ఉదహరిస్తే నమ్మశక్యం కాకపోవచ్చు మఠ పరిపాలనలో, శిష్యులకు మఠానికి గల సంబంధాన్ని పటిష్టవంతం చేయటంలో, మఠానికి శాఖలను ఏర్పాటు చేయటంలో, వేదశాస్త్రాధ్యయనానికి ప్రాముఖ్యమిచ్చి, ప్రచారం చేయటంలో - ఒక్క మాటలో చెప్పాలంటే ఆస్తికజన సామాన్యానికి ఉపయోగపడే ప్రతి విషయంలోనూ ఆచార్యపాదుల పాత్ర ఉంది. మఠానికి సంబంధించిన ప్రతి విషయంలోనూ వారి ప్రభావం కనబడ్తుంది.

శ్రీ శృంగేరి శారదాపీఠానికి చెందిన గురు పరంపర శిష్యుల నాశీర్వదించుటకై సంచారం చేయటం మొదటినుంచీ వస్తున్న ఆచారం. అయితే మా గురు పాదులవలె కన్యాకుమారి నుండి కాశ్మీరు వరకు విస్తృతంగా పర్యటించిన ఆచార్యులు శ్రీమఠ చరిత్రలోనే లేరనటంలో అతిశయోక్తిలేదు. అంతేకాదు. ఆది శంకరుల అనంతరం నేపాలును సందర్శించిన ఆమ్నాయ పీఠాధిపతి కూడ వీరొక్కరే. 1967 లో మహాశివరాత్రి పర్వదినాన్ని నేపాల్ పశుపతినాథ్ సాన్నిధ్యంలో ఆచార్యపాదులు గడిపారు. నేపాలు మహారాజు చేసుకున్న విన్నపాన్ని మన్నించి నేపాలు వెళ్ళారు అంతేకాని తనంతట తామే వెళ్లలేదు. తమ తండ్రిగారైన మహారాజా త్రిభువన్‌కు శ్రీ శృంగేరి పీఠాధిపతుల నుండి లభ్యమైన ప్రత్యేక ఆశీస్సులకు కృతజ్ఞతాపూర్వకంగా మహారాజా మహేంద్ర తమ ఆహ్వానాన్ని మన్నించమని ఆచార్యపాదులను వేడుకున్నారు. 1951 లో మహారాజా త్రిభువన్ చాలా పెద్ద కష్టాన్ని ఎదుర్కొనవలసి వచ్చింది. భారతదేశానికి వచ్చి అజ్ఞాతంగా గడిపాడాయన. ఆ రోజుల్లో అంతర్ముఖులుగా ఉంటున్న శ్రీ జగద్గురు చంద్రశేఖర భారతీమహాస్వామి వారు ఢిల్లీలో నివసిస్తున్న మహారాజుకు ఒక శ్రీముఖాన్ని పంపమని ఆదేశించారు. అందులో "మీ సింహాసనం మీకు

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

తిరిగి లభిస్తుంది శ్రీ శారదాంబ, శ్రీ చంద్రమౌళీశ్వర, శ్రీ పశుపతినాథుల ఆశీస్సులు మీకు లభ్యమవుతాయి!" అని ఆశీస్సులు పంపారు. వారి ఆశీస్సులు ఫలించాయి. కొద్ది వారాలలోనే మహారాజా త్రిభువన్ తన సింహాసనాన్ని తిరిగి సంపాదించుకున్నారు. మా ఆచార్య పాదులను నేపాలు సందర్శించమని విన్నవించుకున్నప్పుడు మహారాజా మహేంద్ర మనస్సులో ఈ విషయాలన్నీ ఉన్నాయి. మహారాజు ఆచార్యులకు ప్రత్యేకమైన గౌరవాన్ని నివేదించుకున్నారు. శ్రీ పశుపతినాథుని దేవాలయానికి ప్రత్యేక గౌరవ మర్యాదలతో ఆచార్యపాదులను తీసుకువెళ్లారు.

1966 లో మొట్టమొదటిసారి సంచారానికై ఆచార్యపాదులు బయలుదేరారు. వరుసగా ఆరు సంవత్సరాలు పర్యటిస్తూనే ఉన్నారు. కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో పర్యటించారు. మరల 1984 జూన్ నెలలో శృంగేరిలో బయలుదేరి నాలుగు సంవత్సరాలు దక్షిణ, ఉత్తర ప్రాంతాలలో పర్యటించి, దేశంలో చాలాచోట్ల మఠ శాఖలను ప్రారంభించారు. శ్రీ శారదాంబ శ్రీ శంకర భగవత్పాద దేవాలయాలను నిర్మింపజేసారు. వేద పాఠశాలలను స్థాపించారు ధార్మిక కార్యక్రమాలకు ప్రోత్సాహమిచ్చారు.

బెంగుళూరు నగరంలో ఉన్న శాస్త్రపాఠశాలకు తోడు వేద పాఠశాలను ప్రారంభించారు. శృంగేరిలో గత వంద సంవత్సరాలుగా నిర్వహించబడ్తున్న పాఠశాలలో, వారి హయాంలో, తీసుకువచ్చిన మార్పులు, చేర్పులు అందరికి తెలిసినవే.

సంస్కృత భాషా ప్రచారానికై 'సుర సరస్వతీ సభ'ను స్థాపించి, దాని ద్వారా సంవత్సరానికి రెండుసార్లు పరీక్షలు నిర్వహింపబడేటట్లు చేసారు. ఆ పరీక్షలకు ఒక్కొక్కసారి ఆరువేల మంది పైన హాజరవుతుంటారు. (సశేషము)

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

శ్రీగురుభ్యోనమః

శ్రీశంకర భగవత్పాదాచార్య విరచిత

శత శ్లోకి

వ్యాఖ్యాత ॥ పరమహంస పరివ్రాజక

శ్రీ అద్వయానంద భారతీస్వామి

(గత సంచిక తరువాయి)

శ్లో॥ బంధోజన్మాత్యయాత్మా యది నపున రభూత్తర్హి మోక్షోఽపి నాసీత్ ।
యద్వద్రాత్రి ర్దినం వానభవతి తరణౌ కింతు రుద్ఘోష ఏషః ।
అప్రాణం శుద్ధమేకం సమభవ దథతన్మా యయాకర్తృ సంజ్ఞాం
తస్మాదన్యచ్చ నాసీత్ పరివృత మజయా జీవభూతం తదేవ ॥ 24

ప్రళయమునందు సర్వజీవములను సంహరించుటకొక కర్త యుండవలెను కావున సకల సంహారకర్తయగు మృత్యు వుండెనని సమ్మతింపవలసి వచ్చు చున్నది. అట్లు కానిచో ఆమరణ రూప ప్రాణస్థితి యుండవలెను కదా! దానికి సమాధానము.

ప్రాణుల యొక్క సుఖ దుఃఖ భోగముల కుహేతుభూతమగు కర్మ పరిపక్వమైనపుడు ప్రపంచము నిర్వ్యాజమై పోవును. అపుడు ఇచ్ఛామాత్రము చేతనే పరమేశ్వరుడు సర్వమును లయించును. అందుచేత పరమేశ్వరుని కంటె వేరొకటి మృత్యువుగాని మరొకటిగాని లేదు. జన్మాత్యయ రూపసంబంధము లేదు కావున మోక్షములేదు. సూర్యచంద్రులు లేరుగాన దివారాత్రములు లేవు. అహోరాత్రములు లేవు. సూర్యచంద్రులు లేరు. కాలము కూడ లేదు. సాంఖ్యులు చెప్పుచున్న ప్రధానమైన మాయ నపుడు స్వతంత్రమై జగత్కారణముగా నుండె ననుటకును వీలులేదు. జడమగు మాయ స్వతంత్రముగా జగత్కారణము కాజాలదు.

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

అపుడున్నది తటస్థ లక్షణోపలక్షితము (సృష్టి స్థితిలయ కర్తృత్వరూప) ఆద్వితీయము, అఖండమునగు పరబ్రహ్మ తత్త్వము. అది మాయతో ఆవి భావన్నమై యున్నది. అదియే జగత్కారణము మాయావచ్ఛిన్న చైతన్య మైన నది యొక్కటియే అపుడున్నది.

దీనినే ఋగ్వేదము కూడ చెప్పినది.

నమృత్యురాసీ దమృతం నతర్హి నరాత్యా అహ్నఆశీత్ప్రకేతః
అనీదవాతం స్వధయాతదేకం తస్మా ద్ధాన్యన్న పరఃకించనాసః ॥

శ్లో॥ ప్రాగాసీద్భావరూపం తమ ఇతితమ్మాసా గూఢమస్మాదతర్క్యం
క్షీరాంతర్య ద్వదంభోజ నిరిహ జగతో నామరూపాత్మకస్య
కామాద్ధాతుః సిస్పృక్షో రనుగతజగతః కర్మభిః సంప్రవృత్తా
ద్రేతోరూపై ర్మనోభిః ప్రథమ మనుగతైః సంతతైః కార్యమాణైః ॥ 25

సృష్టికి పూర్వము జగత్తున్నదా? లేనిచో లేనిది ప్రభవమగుటెట్లు? ఉత్పన్నమగుచున్నదని చెప్పుకొందమన్నచో అసత్కార్యవాదమును గ్రహించి నట్లే అగును. అట్లు కాదని పూర్వమే జగత్తుకలదని చెప్పుచు సత్కార్యవాద మును అనుసరించుదమన్నచో పూర్వమున్నది. మరల సృష్టియెందుకు? ఈ ప్రశ్నలకు సమాధానముగా భగవత్పాదులీ శ్లోకమును రచించిరి.

సూర్యకాంతి లేనప్పుడు చీకటిచేత జగత్తు కప్పబడి ఆచ్ఛాదింపబడి - ఏది చీకటియో, ఏది జగత్తో తెల్సుకొనుటకు వీలులేని అతర్క్యముగా నుండును. అజ్ఞాయమానముగా నుండును. అదెట్లనగా పాలలో కలసిపోయిన నీటివలె.

సృష్టికి పూర్వము నామరూపాత్మకమగు జగత్తు మాయా తమస్సుచే ఆవరింపబడి నామరూపములను పోగొట్టుకొని విత్తునందు వృక్షము సూక్ష్మరూప ముగనున్నట్లు మాయలో మునిగిపోయి యున్నది. కారణ సామగ్రి వ్యతిరేక ముగానేదియు ఉత్పన్నముకాదు. పరమేశ్వరుని ఇచ్ఛచేత అనుగతమై సంప్రవృ త్తమగుచున్నది. అనాదిగా వర్తించుచున్న జగత్తేమరల ప్రేరితమై వెలువడి

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

సృష్టియగుచున్నది. బీజభూతముగా నుండి మరల అనాది ప్రవహితముగా నిష్పాదితమగుచున్నది.

ఈ విషయమును శ్రుతి యిట్లు చెప్పినది -

తమ ఆసీత్తమసా గూళహమగ్రేఽప్రకేతం సలిలం సర్వమా ఇదమ్
తుచ్ఛ్యేనాభ్వపిహితం యదాసీత్తపస్తన్మహినా జాయతైకమ్।
కామస్తదగ్రేసమ వర్తతాధి మనసోరేతః ప్రథమం యదాసీత్
సతోబంధు మసతి నిరవిందన్ హృది ప్రతిష్యాకవయో మనీషా
(ఋగ్వేద)

జగత్తు తమస్సునందు కర్మకర్తృభావ యోక్తికముగా వర్తించునపుడు వ్యవహారిక దశయందున్నట్లు నామరూపములు విస్పష్టముగా తెలియవు. తాదాత్మ్యమైనవి.

ఈ విషయమును మనస్మృతి కారుడు కూడ చెప్పెను.

ఆ సీది దంతమో భూతమ ప్రజ్ఞాతమలక్షణమ్
ఆప్రతర్క్యమనిర్దేశ్యం ప్రసుప్త మివ సర్వతః॥

జగత్తు మాయాలీనమై ప్రళయవేళ యందుండుట క్షీరమునందున్న నీటి వలెననుట ఉపమా అలంకారము. క్షీరమునందు నీరిదియని వేరు చేయనలవి కాదు కావున అది దుర్విజ్ఞేయము. అవిభాగాపన్నము.

తమో ఆచ్ఛాదితమైన జగత్తు మరల వెలువడుటకు పరమేశ్వరుని ఇచ్ఛ కారణము. (సోఽకామయత - బహుస్యాం ప్రజాయే యేతి - శ్రుతి) పూర్వ కల్పమున ప్రాణుల పుణ్యా పుణ్య రూపకర్మము పరిపక్వము కాగానే పరమేశ్వరునికి (సర్వకర్మాధ్యక్షునికి) సృష్టి పర్యాలోచన కలుగును. అప్పుడు యథా పూర్వముగా నామరూపాత్మకము చిత్రవిచిత్ర రూపకమునగు జగత్తు ఆవిర్భవించును.

ఈ సమాధానము వలన అసత్కార్య వాదము సత్కార్యవాదము రెండును నిరాకరింపబడినవి. (విశేషము)

CC-O. In Public Domain. Digitized by eGangotri

శ్రీ శంకర గురు పరబ్రహ్మణే నమః

శంకర విజయ ధ్వజము

బ్రహ్మశ్రీ కొక్కొండ వేంకటరత్నశర్మ గారు

చతుర్దశ పర్వము - జయపర్వము

(గత సంచిక తరువాయి)

అంతం గంధర్వోపాసకులు తాము నాదబ్రహ్మోపాసకులమని, శబ్ద బ్రహ్మోపాసకులమని, నాదబిందు కళాజ్ఞానమే మోక్షదమని వాదించిరి. అంతట జగద్గురుండో గంధర్వోపాసకులారా! మీ మతవాదము వేదవిరుద్ధము. ఎందు వల్ల ననఁగా, నాదబిందు కళాతీతమును, శబ్దాతీతమును నైన పరతత్త్వము బ్రహ్మమని వేదము ప్రతిపాదించుచున్నది. స్మృతియును శబ్దాద్యగోచరమును, నాదబిందు కళాతీతమునగు పరతత్త్వమే బ్రహ్మమని నిరూపించు చున్నది. కాఁబట్టి మీరలు వట్టి దారిఁబట్టక నెట్టన నద్వైత మతప్రవిష్టులై నా దాద్యగోచర మైన బ్రహ్మము నాత్మస్వరూపముగా భావించుకొని కృతార్థులరుకండు. నానా నాదోపాసకులందఱును జగదాచార్యానువర్తులై ధన్యులైరి. తరువాత పైతాళ సేవకులు భూతారాధకులును యతిశంకరునకు జోతలిడి యో యతీశ్వరా! భూతో పాసనంజేసి మేము సర్వలోక వశీకరణ సమర్థులమగు చున్నాము. మా మతము మేలు. నావుడు నా దండకమండలు ధరుండు భూతేశుండయ్యును, భూత పైతాళా ద్యుపాసన భూసురుల కనర్హమనియు, మఱి బ్రాహ్మణ ధర్మధ్వంసక పనియుం జెప్పి, వారొప్పుకొన, వ్వారిం గృతప్రాయశ్చిత్తులఁ బరిశుద్ధచిత్తులఁ బంచాయ తన పూజాంచితుల శుద్ధాద్వైత మతులుగం గావించె. ఇది యది యననేల? శ్రీ శంకర యతీశ్వరుం డా కాలంబున నీ భరత ఖండంబునన్ గల సర్వమతముల నవలీల నవలీలం జయించె వెండియు ఖండనకారుండైన శ్రీహర్షు బలుమఱు నోడించెనట. ఉదయ నాథినవగుప్తాదుల గెలుచుట యననెంత? అవ్విధమున

CC-O. In Public Domain. Digitized by eGangotri

విజయధ్వజ విరాజమానుండై, త్రిపురాసురులం గెలిచి వెల్లుగఁదేజరిల్లిన యల్ల ముక్కంటి మాడ్కి మిక్కిలి వెలుఁగొందె.

అపుడు పరవాది దవానలుఁడు, త్రిపురాంబా కుమారుఁడు బిందు మాధవాచార్యుఁడు దివాకరాచార్యుఁడు, ధుండి గణేశ్వరుఁడు వటుకనాథుఁడు ననువారాఱుపురు శైవ శాక్త వైష్ణవ సౌరగాణాపత కాపాల మతాభిమానులు శ్రీమచ్ఛంకర భగవత్పాదాచార్య శిష్యులు గురువరునకుం గృతసాష్టాంగ నమస్కారులై, సాంజలులై, యిట్లనిరి- మహాస్వామీ! తాము వేదవేదాంత సమ్మతమ్మై దివ్యమ్మైనది యద్వైత మతమ్మేయనియుఁ దదన్యమత మసారమనియు సంసార వృద్ధికరమగుటచే ననర్థావహమనియును సిద్ధాంతీకరించినారు. ఆద్వైతమత ప్రతిపాద్యమైన పరబ్రహ్మము నిత్యము నిరంతరము నిర్గుణము నిరాకారము నిర్వికారము నిరాలంబమునుగా నున్నది. కాన నీకలి కాలమందు మందబుద్ధుల కందుఁబ్రసక్తి యెట్లు పుట్టు? పుట్టనే పుట్టదనవచ్చును. పుట్టినం దుదముట్టం దానియందు నిష్ఠగలుగుట దుర్ఘటము కాఁబట్టి శైవము, శాక్తము, వైష్ణవము, సౌరము, గాణాపతము, కాపాలమునను నీ షణ్మతములను స్థాపించి షణ్మత స్థాపనాచార్యుఁడని సత్ప్రతిష్ఠం గాంచుఁడని ప్రార్థించిరి. ఇట్లు ప్రార్థింపఁబడి శంకర సంయమీశ్వరుండు శిష్యులారా! ఎవరెవరికి నేయే మతమున నభిరుచి గలదో, వారు వారాయామతము నవలంబింప వచ్చును ఐనన్, శ్రుతిస్మృతులచే విధింపఁబడిన బ్రాహ్మణ ధర్మమును మాన కనుష్ఠింపవలయును. దానికి నవిద్ధముగఁ జలపు సగుణోపాసనము నిర్గుణోపాసనా సౌధమునకు సోపానము వంటిది. కావున నది కేవల దూష్యముగాదు. కాని, కాల్పఁబడిన లోహముద్రలచే మేను గాల్చికొనుట, సొలసుదిండిఁ దినుట, కల్లు ద్రాగుట, వెఱ్ఱెత్తువలఁ గలయుటయు నను నిమొదలయినవి వేదశాస్త్ర నిషిద్ధ కర్మములు గాన వాని మానవలయును. ఈ నియమము ననుసరించి మీరు మీ కిష్టములైన షణ్మతములను ప్రవర్తిఁ జేయవచ్చును. అని యభ్యనుజ్ఞ నిచ్చెను. అంతన్వారలు సంతుష్టాంతఃకరణులై, గుర్వను జ్ఞాతులై, స్వేష్ట మతముల వెలయింప నింపు మెయివలయునెడఁకు నడచిరి. శంకర యతీశ్వరుండు నుక్తరీతిం గృతానుష్ఠంగమతాంగీకారుండై, "షణ్మత స్థాపనాచార్యుం"డని బిరుదాభిధానముం బొందె. అంతం

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

డచ్చంకరుండు తానాచార్య సార్వభౌముఁడగుట న్సార్వభౌమ నామక దిగ్గజ సంయుక్తఁబగు నుత్తరదిశం జయింప ననంజని, కృతకృత్యుం డగుచుం బదరి కాశ్రమంబుం బ్రాపించె. అందుం గొన్నాళ్లు నెలవుకొని యుండెను. అత్తటి సత్యద్భుతముగ నాకాశవాణి యిటు వినఁబడియె. ఓ కైలాసపతీ! యతీశ్వరా! శ్రీ శంకరా! నీయుదగ్దిగ్వి జయమును బ్రకటించుచు నీ మఠమొకటి యిట నుండవలయు ఇది హిమవద్గిరి దండ నుండుటంజేసి నీ శిష్యుఁ డానందగిరి యీ మఠమునకు నధిపతిగ నుండుట సముచితము. అని వినఁబడుడును శ్రీ శంకర సంయమి సార్వభౌముఁడు తన మనమున నిటులు తలఁచె. ఈ బదరికాశ్రమ మందే ముందే భాష్యాది గ్రంథంబుల రచించి ప్రకటించితి. కనుక నిట మన్మఠ మొకటి యుంట యుచితము. ఇది యుత్తమక్షేత్రము. అలకనందిని తీర్థము. శ్రీ నారాయణుండు దేవుండు. శ్రీ పుణ్యాం బికశక్తి. పుణ్యపురుషైక సమాశ్రయ నీయ మీ దివ్యస్థలము. అని తలంచి, యట జ్యోతిర్మఠమును నిర్మించి, నిర పేక్షుఁడైన పారికాంక్షిం ద్రు నానంద గిర్యాచార్యునిం బలాత్కారంబునం దత్ప్ర ధాధిపతిగ నెలకొల్పి, "అయమాత్మా బ్రహ్మ" అను నధర్వణవేద మహావాక్యము నీ శిష్యపరంపరకు నుపదేశ్యం బని యయ్యతీశుఁ కానతిచ్చె. మఱి యచ్చటఁ దీర్థయాత్రార్థులకుఁ జలివలన నిలుగు గలుగకుండ స్నానము సమకొనుటకై శ్రీ మన్నారాయణు నాదించి తత్కారుణ్యమున నొక యష్టోదక కుండమును గల్పించె. ఆ వేదినీళ్ల గుండ మిప్పుడు నప్పట్టున శ్రీ శంకర యతీశ్వర ఫాల నేత్రమన భాసిలుచుండును. పదపడి గంగాతీరంబునం బ్రాచార్యుండైన గౌడ పాదాచార్యుండు శంకరయతి సింహునికి సాష్టాంగంబు నాచరించి, సంపూజితుఁడై, 'జయ శంకర జయ శంకర' యని శంకర విజయము యని యభినందించె. యతి శంకరు డానందించె. సుమనులు హర్షించిరి. సుమనోవర్షము వర్షించిరి.

శ్రీ జయ శంకరాయ నమః

ఇది శ్రీ శంకర విజయధ్వజఁబను గద్యప్రబంధంబునందుం

జతుర్దశపర్వము - జయపర్వము.

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

శ్రీ గురుభ్యోనమః

మనమూ - మన మతమూ

బ్రహ్మశ్రీ తుమ్మలపల్లి రామలింగేశ్వరరావుగారు

(గత సంచిక తరువాయి)

ఈ సందర్భంలో భగవద్గీత కొన్ని వివరణలు చేస్తున్నది. "యోగము తిండిపోతునకు కాదు - అతి స్వల్పంగా తినేవారికి కాదు. ఎక్కువ నిద్రపోయే వానికి కాదు. తక్కువ నిద్రపోయేవానికి కాదు ఆహార విహారాలలో సముచిత పరిధులలో ఉండేవానికి - తన అన్ని పనులను క్రమత్వంలో ఉంచుకునేవానికి' నిద్రనూ మెలకువనూ తగినట్లు ఉంచుకునేవానికి గాను యోగం. అది అన్ని దుఃఖాలనూ పోగొట్టుతుంది."

ఈ నియమనంలో ఉన్నతస్థాయి అసంగత్వం; వైరాగ్యం. అది మూడవ ప్రధాన సద్గుణం. జీవితంలో దుష్టమైన వాటిని అధిగమించడమూ మాత్రమేకాదు. జీవితంలో మంచి వాటినుంచి కూడా స్వేచ్ఛగా ఉండాలి. గృహ సంబంధమైన ప్రేమాభిమానాలు, ఉదాహరణకు కుటుంబ బంధాలు, ఇంటిపైన స్నేహితులపైన మమకారం - వాటికవి మంచివే. అయితే గ్రుడ్డిగా ఆలౌకిక, ఐహిక, బంధములలో బంధించబడి ఉండిపోతే ఆధ్యాత్మిక సాధనా మార్గంలో మన ప్రయాణమింకా మొదలైనట్లేకాదు. ఈ బంధాలు జీవిత ప్రారంభదశలో అతి బలమైనవిగా ఉంటాయి.

అయితే ఒకసారి మృత్యువు సన్నిహిత వర్గంలోని వాళ్ళను కబళించిపోతే - ఈ బంధాలన్నీ క్షణ భంగురాలని గమనానికి వస్తుంది. అప్పుడు భూమిపైన మన జీవితకాలం కూడా పెక్కు శతాబ్దులకు లోబడినదేనని జ్ఞాపకం వస్తుంది. ఈ లోకంలో మనమంతా అల్పకాలికమైన మనుగడవాళమేనని తెలుస్తుంది. మన ప్రేమాభిమానాలకు పాత్రమైన వస్తువులన్నీ కాల సముద్రంలో

Sri Vidyabharathi Book Centre, Siruguppa

CC-O. In Public Domain. Digitized by eGangotri

స్వల్పకాలం మాత్రమే కలిసి ఉండి తరువాత వేరు వేరుగా కొట్టుకుపోయేవేనని మనం గ్రహిస్తాము. ప్రేమ, అభిమానం, మైత్రి - నిజానికి దివ్య గుణాలే - ఆ గుణాలను అభివృద్ధి చేసుకుంటే హృదయాలలో భగవంతునికి దగ్గర అవుతున్నామనిపిస్తుంది కూడాను అయితే ఆ గుణాంను అభివృద్ధి చేసుకోవడమంటే గ్రుడ్డిగా - ఆవి కలిగిస్తున్న బంధాలలో పడిపోయి ఉండటం కాదు.

హృదయాలలో కుటుంబ సభ్యులపైన ఉన్నప్రేమను క్రమ క్రమంగా విస్తరింపచెయ్యాలి. సన్న్యాసి గృహస్థునికంటె ఉన్నత స్థితిలో ఎందుకు ఉన్నాడంటే - సన్న్యాసికి వసుధ అంతా కుటుంబమే. అందరిపైనా ప్రేమాభిమానాలే. బృహదారణ్యక ఉపనిషత్తులో యాజ్ఞవల్క్య మహర్షి ఆయన భార్య మైత్రేయికి చెప్పిన సందేశం - (ఆయన అరణ్యానికి వెళ్ళబోయేముందు చెప్పినది) చాల ప్రముఖమైంది. (బృహ ఆ2, బ్రా 4, మం 5).

"ఓసి ప్రియురాలా! భార్యయన్నది తన పతియొక్క ప్రయోజనము కొరకా ప్రియమైయుండుట? కాదు. తన ఆత్మప్రయోజనము కొరకై ప్రియముగా నున్నది. అట్లే పతియైనవాడు తన పత్నియందును, తండ్రియైనవాడు కుమారునియందును, ఒకడు ధనమునందును, ఒకడు బ్రాహ్మణుని యందును, ఒకడు క్షత్రియునియందును, ఒకడు లోకులయందును, ఒకడు దేవతలయందును, ఒకడు భూతములయందును, ఒకడు సమస్తములయందును ప్రీతి నుంచుచున్నాడు. సర్వమును ఆత్మకొరకే గాని వేరుగాదు ఆత్మయే చూడతగినది వినతగినది; తెలియతగినది; ధ్యానింపదగినది. ఆత్మ దర్శనముచేతను, శ్రవణము చేతను, స్మరణముచేతను, ధ్యానముచేతను సర్వమును బోధమగును."

భగవద్గీత మరల మరల చెప్పుచున్నది. ఐహికమైన బంధములను పోగొట్టుకుని, ఒకే ఒక అముష్మిక సంబంధ ముంచుకొనుమని - అప్పుడుగాని ఆనందానుభూతి కలుగదని. "అన్నిటిని పరిత్యజించి నన్ను శరణుపొందుము" అని పరమాత్మ బోధించినాడు. ఐహిక విషయములతో నున్న 'సంగత్వము' సమసిపోయి, భగవంతునితో కలిసిపోవు యత్నమైన యోగత్వము ప్రారంభం కావాలి. సంగత్వము సకల దుఃఖకారణము యోగము ఆనంద హేతువు.

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

అందుచేత మన మతము అసంగత్వాన్ని (వైరాగ్యాన్ని) ముఖ్య సద్గుణంగా ప్రశంసిస్తున్నది. అసంగత్వమంటే - ప్రేమాభిమానాలను నిర్మూలించడం కాదు. వాటిని సర్వానికి విస్తరించి సర్వగతమైన బ్రహ్మ పదార్థవలంబనము చేయుట, ఈ ప్రేమాభిమానాలలోనుంచి స్వార్థాన్ని తొలగించి - వాటిని దేశకాలాతీతంగా చేయమని ప్రబోధం.

దేశకాలా తీతమైనది నిత్యసత్యం. క్షణభంగురమైన వాటియొక్క బంధములనుండి బయటపడి, నిత్యసత్యమై కాలముచేత బాధింపబడని దానితో ఆనుబంధించుకొనవలెను. ప్రధాన సద్గుణములలో 'సత్యము' అన్నది -లోకమున నిజము చెప్పుటకంటె అధికాధికమైనది- మన పవిత్ర గ్రంథాలలో నిజముచెప్పే గుణము సత్యసంధత్వము- మహావీర లక్షణంగానూ - మహామునుల లక్షణంగానూ చెప్పబడుతున్నది. ఆ సత్యసంధత్వముకంటె - ఈ సత్యము మహోన్నతమైనది. హరిశ్చంద్రుడు, యుధిష్ఠురుడు, దశరథుడు మొదలగువారు చెప్పినమాట నిలబెట్టుకోవడానికిగాను చేసిన త్యాగాలను గమనిస్తే మన మహర్షులు సత్యసంధత్వానికి ఎంత విలువ ఇచ్చారో అవగాహన అవుతుంది. సత్యసంధత్వాన్ని మించిన కర్తవ్యం లేదనీ, అసత్యం పలుకుటకంటె మహాపాపం లేదనీ మహర్షులు అంటున్నారు.

అయితే అన్ని సద్గుణాలూ సత్యమునుండి వచ్చినవేనని, సకల ధర్మమూ, న్యాయమూ సత్యమునుంచి ప్రాదుర్భవించిన వని మహర్షులు అన్నప్పుడు- వారి అభిప్రాయంలో సత్యసంధత్వంకంటె- ఉన్నతమైనదాన్ని వారు ఉద్దేశించారని గ్రహించాలి. ఈశ్వరుడు సర్వోన్నతమైన యాథార్థ్యము. అన్ని ఉత్తమ, శాశ్వత విలువలకీ (ధర్మము, న్యాయము, సత్యము, సౌందర్యము) ఆయనే ఆధారము. కాబట్టి 'సత్యం' అంటే - శాశ్వతిసత్త - జ్ఞానములో సత్యమైనది - ప్రవర్తనతో సమీచీనమైనది. సాంఘిక వ్యవహారాలలో సాధువైనది; న్యాయమైనది. విజ్ఞానశాస్త్రంలో అనంతమైన పురోగతికి ద్వారము తెరిచే సద్గుణమదే. కళాప్రగతికీ, సాంఘికమైన న్యాయానికీ, నైతిక విలువలకూ ఆ సద్గుణ ప్రభావమే అందదండలు.

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

సత్యాన్ని గురించిన చింతనతో మనం నీతిశాస్త్రాన్ని, తత్త్వశాస్త్రాన్ని కూడా మరచిపోవచ్చు మన పవిత్ర గ్రంథాలు చెప్పుతున్నదేమంటే- "సత్యాన్ని అనుగమించు- అది ఎక్కడకు తీసుకువెళ్ళినా ఫరవాలేదు - ఆ అనుగమనంలో ఎన్ని త్యాగాలు చేయవలసి వచ్చినా ఫరవాలేదు. మానవుని పురోగతికి సత్యం విస్మరింపరానిది."

హిందూమతం విజ్ఞానశాస్త్ర పరిశోధనలకు అడ్డు చెప్పలేదు. తత్త్వజిజ్ఞాసాత్మక శాస్త్రంలోగాని, నీతిశాస్త్రంలోగాని- ఎటువంటి ఊహలు చేసినా మన మతం వద్దనలేదు. ఆంక్షలు విధించలేదు. ఏ కాలంలోగాని మనతత్త్వసాత్మక శాస్త్రనిర్ణయాలు, నీతిశాస్త్ర నియమాలు, వేదం చెప్పుతున్న పరమ యాథార్థ్యమును గురించి సంపూర్ణంగా వెల్లడింపలేకపోతున్నాయని మన మతం భావిస్తున్నది. ఆ పరమ యథార్థ్యాన్ని గురించి క్రొత్త అనుభవాలు చెప్పుతున్నామనే వారిని మనం ఆలకిస్తూనే ఉన్నాము ఇంతకు మానవ చైతన్య ప్రగతికి హద్దులు నిర్ణయింపగలవారెవ్వరు?

ప్రధాన సద్గుణాలలో ఒకటైన 'సత్యం' అంటే 'సత్యసంథత'తోపాటు నిజాయితీ, ఆకృతిమత్వము, నిష్కాపట్యము, మనఃపూర్వకత ఉండటమే కాకుండా - ఎదురుగా ఉన్న వాస్తవికతనుబట్టి పురోగమన చింతన చేయడం - సకల సౌందర్య రూపాలను అభినందించడం - నీతి విషయికంగా, సత్ప్రవర్తన విషయికంగా విశ్రాంతిలేని పురోగమన యాత్ర చేయడం కూడా ఉన్నాయి.

మన పవిత్ర గ్రంథాలలో సత్యముతోపాటు అహింస జతకట్టి ఉన్నది. ఈ రెండు సద్గుణాలు సర్వోత్కృష్టాలని సంభావన. యావద్భారత మత సంస్కృతికి భారతీయులు కూర్చిన వెలుగు అహింస. అహింస యొక్క ప్రాముఖ్యం విషయంలో హైందవమతం, బౌద్ధ - జైన మతాలు ఏకవాక్యత కలిగి ఉన్నాయి. ఇతర మానవుల యందేకాదు సర్వ ప్రాణికోటియందు భూతదయ. ఇటీవలి కాలంలో అహింసను ఆయుధం తీసుకుని మహాత్మాగాంధి సాధించిన ఘన విజయాలు మన చరిత్రకే వెలుగును కలిగించాయి.

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

అహింసను ప్రబోధించిన మన మహర్షులు - పరిపూర్ణమైన అహింస మానవసాధ్యం కాదన్నారు. అది - క్షేత్రగణితంలో బుజురేఖ వంటిది. నిత్య జీవితంలో దానికి పిలైనంత దగ్గరగా మనం ఆచరణలో పెట్టుతాము. ఉదాహరణకు - అన్ని ప్రాణులూ తమ ఆహారాన్ని హింసతోనే సంపాదిస్తాయి. కొన్ని జంతుప్రాణుల్ని వధిస్తే, కొన్ని వృక్షప్రాణుల్ని వధించడం జరుగుతున్నది. అయితే జంతువులో వృక్షములలో కంటె ప్రాణసత్వం అధికంగా ఉన్నది కాబట్టి - వృక్షములను హింసించడం కంటె జంతువుల్ని హింసించినపుడు హింస అధికం జరుగుతున్నదని స్పష్టమౌతున్నది. అందుకని మన మతం శాకాహారము తీసుకోవడం మాంసాహారం తీసుకోవడం కంటె మంచి మార్గమని అంటున్నది. పరమాదర్శ జీవియైన మునీశ్వరుడు వాయుభక్షణతో సరిపెట్టుకుంటాడట. ఆయన తన శరీర పోషణకు జంతువులనుగాని, వృక్షములనుగాని హింసించడట.

ఈ ముఖ్య సద్గుణాలను అభ్యాసంవల్ల కైవశం చేసుకొన్నందువలననే 'హిందువులు' నేటి కిట్లా ఉన్నారు. మన జాతియొక్క ఉన్నత గుణాలు, బహుళ మన జాతియొక్క దౌర్బల్యాలు యీ ముఖ్య సద్గుణాల అభ్యాసం మూలంగా సముత్పన్నమైనవేనేమో. మన మతస్థుల హృదయమార్దవము, అతిథి అభ్యాగత సేవాసంసిద్ధత, మానవతా భావము, రక్తపాతమునందు వారికున్న వైముఖ్యము, వారికున్న నితాంతాపార భూతదయ, వారు గోమాతను దేవతగా భావించుట - ఈ అన్నియు ముఖ్య సద్గుణాల అభ్యాసం మూలంగానే. ఒక్క మాటలో చెప్పాలంటే హైందవ నాగరికతలోని శాంతము, నెమ్మదితనము - అహింసా గుణోత్పన్నములే. ఎంతో పేదతనాన్ని, దారిద్ర్యాన్ని అనుభవిస్తున్న భారతదేశపు సామాన్య జనులు ఇతర దేశాలలోని పేదజనం కంటె - ఎన్నో రెట్లు అధికంగా సాధువులుగా ఉన్నారనీ - ఆ యితర దేశాలవారి కున్నంత వివేకహీన పశు ప్రాయత్వం మనవాళ్లకు లేదనీ తెలుస్తున్నది. దీనికి కారణం మనవాళ్ళు అహింసను ప్రబోధిస్తూ ఆచరణలో చూపిస్తూండటమే.

సద్గుణాలను ముఖ్య సద్గుణాలనీ, ఇతరములనీ - విభాగించి చెప్పడం - వివరణ చెయ్యడంలో అనుకూలత కోసమేగాని - వేరొక కారణం లేదు. ఒక

Sri Vidyabharati Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

సద్గుణానికి మరొక సద్గుణానికి మధ్య హద్దుగీత లేదు. అట్లాగే వైయక్తిక సద్గుణాలకీ సామూహిక (సాంఘిక) సద్గుణాలకూ మధ్య కూడా హద్దుగీత గీయలేము. ఈ సద్గుణాలన్నీ మూలంలో ఒక్కటే. ఇవన్నీ కలసి గుణవంతమైన సత్ప్రవర్తన కలిగిస్తాయి. సత్ప్రవర్తన వలన సాధింపబడేది దివ్యమైన పరిపూర్ణత అని గ్రహిస్తే - యీ సద్గుణాల ప్రాముఖ్యం స్థూలంగా అవగాహన అవుతుంది. కాబట్టి సత్ప్రవర్తన అలవాటు చేసుకోవడం ఆధ్యాత్మిక ప్రగతి కోరేవాడు చేయవలసిన ముఖ్య కర్తవ్యం. (సశేషము)

చైతన్య మహా వైభవం

—భాగవతి రామమోహనరావు

మానవుని సంసార జీవితం ఉప్పొంగే వరదల్లో ప్రవహించి పోతూండే నది లాంటిదని తత్త్వ వేత్తలు వర్ణిస్తూంటారు. అనేక సంఘటనలతో, ఒడుదుడుకులతో సాగిపోతూండే ఈ జీవిత మహాప్రవాహంలో, పాత విషయాల పరిణామలు, క్రొత్త విషయాల సుఖ దుఃఖానుభవాలు, రాగ ద్వేషాదులతో నిత్యం తటస్థపడుతూంటాయి. అన్ని క్లేశాలకీ, దుఃఖాలకీ మూలకారణం : ఇష్టమైనది దొరక్కపోవడం, అయిష్టమైనది సంప్రాప్తించటం. ఇలా అనుభవిస్తూన్న వాటిలో యదార్థమైన దుఃఖాలు, క్లేశాలు బహు తక్కువగానే ఉంటూ, మిగతావన్నీ వాస్తవానికి దూరాలైన ఊహా ప్రపంచానికి చెందినవేనని అనుభవంవల్ల తెలుస్తూనే ఉంటుంది. శరీరేంద్రియాలతో కూడిన ఈ జీవితం - ఇలా నిత్యం జాగ్రత్, స్వప్నావస్థల్లో అనుభవింపబడుతూంటుంది. సుషుప్తావస్థ అనబడే గాఢ నిద్రలో ఈ జీవితానుభవాలేమీ లేనివారై, కొంచెం సేపు ప్రశాంతంగా విశ్రమిస్తారు.

ఈ సుఖదుఃఖాలు, బాధలు, భయాలు, నిజంగా మనిషికి స్వాభావికమైన అనుభవాలా ? లేక తన స్వభావానికి అన్యమైన అధ్యాసవల్ల ఇవి కలుగుతున్నాయా ? అనేది ముఖ్యాంశం. ఈ కీలకమైన విషయాన్ని, వేదాంత

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

శాస్త్రాలు ఎంతో విపులంగా, విస్పష్టంగా, సందేహ రహితంగా విశదపరుస్తున్నాయి. శంకర భగవత్పాదుల ఉపదేశ సాహస్రిలో శిష్యుని కి విషయాన్ని బోధిస్తూ, జాగ్రత్ స్వప్నావస్థలలో తనచే అనుభవింపబడుతున్న సుఖదుఃఖ రాగద్వేషాదులతో కూడిన విషయాలన్నింటికీ కారణం అవిద్య అనీ, యదార్థంగా ఆ అవస్థలలోని సుఖదుఃఖాల అనుభవాలు మానవుని నిజ స్వభావానికి చెందినవి ఎంతమాత్రం కాదని వివరిస్తారు. అవిద్య అంటే ముఖ్యంగా దేహమేనేను అనుకునే అసత్యమైన భ్రాంతి భావం. జాగ్రదావస్థలో గోచరించే శరీరం, బాహ్య ప్రవృత్తి, ప్రపంచం అన్నీ మానసిక సృష్టియే కాని యదార్థంగా ఆవేవీ లేనివే ననీ, అవన్నీ స్వప్నంలాంటివేనని శంకర భగవత్పాదులు వ్యక్తపరిచారు. అలాంటి వాటిని యదార్థాలుగా భావించడమే అవిద్య. ఈ అవిద్యవల్లే జనన' జరా, మరణ రూప సంసారమవే అసత్యమైన అనుభవ ప్రవృత్తి కలగడం. ఈ అవిద్యను పోగొట్టుకుంటే సంసారపరమైన సుఖదుఃఖాలేవీ అనుభవింపబడవనీ, వాటి యదార్థ జ్ఞానం కలగడంవల్ల, అవన్నీ వట్టి భ్రాంతి భావాలుగా అవగాహన అవుతుంతని వేదాంతశాస్త్రాలు వ్యక్తపరస్తున్నాయి.

ఏది అవిద్యయో, దాని ఆశ్రయమేదో, ఏ విద్యామహిమ వల్ల, స్వస్వరూప జ్ఞానం ఉదయించి, దుఃఖరాహిత్యం కలుగతుందో, విద్యావిద్యల స్వభావాలేవో, వాటిని శంకర భగవత్పాదులు ఉపదేశ సాహస్రిలో ఎంత విశిష్టంగా వివరించారో గమనార్హం :

"త్వం పరమాత్మానం సన్తమ్ అసంసారిణం సంసార్యహమస్మీతి విపరీతం ప్రతి పద్యసే, అకర్తారం సన్తం కర్తేతి; అభోక్తారం సన్తం భోక్తేతి; విద్యానూనంచ అవిద్యా మానమితి, ఇయమవిద్యా" (ఉ॥ సా॥)

అంటే, దేనివల్ల స్వయంగా తాను పరమాత్మ అయి వుండి, పరిచ్ఛిన్నుడనని, అసంసారి అయివుండి, సంసారినని, అకర్త అయి వుండి కర్తనని, అభోక్త అయి వుండి భోక్తనని, అనుభవిస్తూ వుండి తెలియలేని భ్రమపడి పోతున్నాడో

Sri Vidyaranya Publication Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

అదే అవిద్య. ఈ అవిద్య తన యదార్థ సచ్చిదానంద స్వరూపాన్ని కప్పి పుచ్చి, తనని అన్యునిగా తోపిస్తూ తన స్వరూపాన్నే ఆవరించి ఉంది.

ఒక వస్తువుని మరొక వస్తువని భ్రమించి పోవడమే అవిద్య. ఈ అవిద్య వల్లనే నిరాకార, నిర్గుణ, నిర్మల, చైతన్య స్వభావుడైన తనయందు అహంకారం ఆవిర్భవించడము, శరీరేంద్రియ ప్రపంచాదుల ఆరోపణ కలగడము జరుగుచున్నది. దేహమే తానను కొనుచు, బుద్ధేంద్రియ మనోవ్యాపారాదులన్నీ తనవే నని భావిస్తూ, మనుగడ సాగించే జీవుణ్ణి, అవిద్యామయుడని అంటారు. అంటే తన నిజస్వరూపం యేదో ఎరుగని అంధుడని అనడం. ఈ అహంకారం, అంధత్వం తనకి స్వాభావికమైనవి ఎంత మాత్రం కాదని, ఇవి కేవలం భ్రమ కల్పితాలేనని మన వేదాంత శాస్త్రాలు విపులంగా విశద పరుస్తున్నాయి.

గోచరించే శరీర ప్రపంచాదులన్నీ అసద్రూపాలే. ఉన్నదంతా మహత్తరమై ప్రకాశించే బ్రహ్మ స్వరూప చైతన్యమొక్కటే. ఇదే పరమోత్కృష్టమైన అద్వైత సిద్ధాంతసారం. అనంతము, నిశ్చలము, నిర్వికారము అయిన ఆ పరబ్రహ్మ స్వరూపాన్ని, నిస్తరంగ సముద్రంతో పోలుస్తారు. అలా వర్ణింపబడే ఆ పరబ్రహ్మ సాగరంలో ఒక బుడగలా అహంకారమనే మిథ్యాభాసం స్ఫురిస్తుంది. దానివల్లనే శరీర ప్రపంచాదుల భ్రమ సంభవిస్తుంది. ఈ భ్రమనే మనోకల్పితమని, మానసిక రచన అని తాత్వికులంటారు. ఇలా అహంకారం వల్ల పరిమితత్వ భావంతో జీవభ్రాంతి కలిగిన మనిషి- ఇచ్ఛాద్వేషాలనే ద్వంద్వాలలో చిక్కుకోడం సంభవిస్తున్నది.

యోగవాశిష్ఠంలో శ్రీరామ చంద్రునకు వశిష్ఠ మహర్షి, తత్వజ్ఞానాన్ని గురించి బోధిస్తూ, జీవుడై భాసిస్తూన్న ఈ పరిమితత్వపు చైతన్యాన్ని ఇలా వివరించారు :

ప్రాక్తనం గుణ సంభారం మమేతి బహు మన్యతే
యత్తు చిత్తవ తత్త్వజ్ఞం దుఃఖితం జీవ ఉచ్యతే ॥ (112-118)

అంటే, అనాది నుంచీ కరిగిన అధ్యాసవల్ల దేహేంద్రియాది సమస్త విషయ

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

జ్ఞాతాలూ తనవేనని అభిమానం కలిగినదై, యదార్థమైన తత్త్వజ్ఞానం లేకపోవడం వల్ల దుఃఖపరమైనదై వున్న చిత్తమేది కలదో అదే జీవుడని చెప్పబడుచున్నది.

చిత్తం, శరీరం, ప్రపంచాదులు- ఇవేవీ యదార్థంగా లేనివే. ఉన్నదంతా మహత్తరమై ప్రకాశిస్తూన్న ఒక్క బ్రహ్మం (పరమాత్మ) మాత్రమే. ఇది సర్వగతమై, అంతటా నిండి వున్న సత్యస్వరూపం. ఇంద్రియాలకు గోచరించే శరీర ప్రపంచాదులన్నీ ఆసద్రూపాలు. ఇవన్నీ ఎలా గోచరిస్తూ యదార్థాలుగా మనిషిని ఏ విధంగా భ్రమింపజేస్తున్నాయో, ఆధ్యాత్మికంగా అవగాహన చేసుకోవడమే మనుష్యులమై పుట్టినందుకు మన యొక్క ఉత్కృష్ట కర్తవ్యం. ఇలా తెలుసుకునేందుకు ప్రాణాయామం, తత్వజ్ఞానం, మనో నిగ్రహం, ఆసంసక్తి మొదలైన సాధనాలని వేదాంత శాస్త్రాలు వివరించాయి. వీటివల్లే ఆ మహత్తర తత్వం ప్రకటితమై మన నిజస్వరూపంగా భాసిస్తూంది. ఇవన్నీ ఏకాంతంగా అంతర్గతంగా ఎవరికి వారు చేసుకోపలసిన సాధనలు. ఈ సాధనవల్ల అంతర్దృష్టి స్థిరపడి, స్వస్వరూప జ్ఞానం కలుగుతుంది. దుఃఖప్రదమైన దృశ్యజాతమంతా అంతరించిపోతుంది. దుఃఖ రహిత నిరతిశయానందమైన ఆత్మమాత్రమే భాసించినదై, మన స్వరూపంగా భాసిస్తుంది. అదెప్పుడూ సద్రూపమే. సర్వత్రా వెలిగిపోతూ ఉంటూన్నదే. దానికి రాకపోకలనేవి ఎక్కడ? ఎల్లప్పుడూ, అంతటా ఉండేదంతా ఆత్మస్వరూప మొక్కటే. దానికంటె అన్యంగా, ఎప్పుడూ ఎక్కడా ఏదీ లేనేలేదు. అలాంటి సర్వ స్వభావస్థితి కలిగిన ఆత్మానుభవమే మన యదార్థ స్వరూపం. ఆ చైతన్యమే మనలో నేనునేనని భాసిస్తూ, సర్వానికీ విలక్షణమై, కేవలం సాక్షి మాత్రంగా భాసించే మన నిజ స్వరూపం.

పరిశుద్ధ చైతన్య స్వరూపమైన ఈ బ్రహ్మ స్వరూపం ముండకోపనిషత్తులో ఇలా వివరించబడింది :

బ్రహ్మైవేద మమృతం పురస్తాద్ బ్రహ్మ
పశ్చాద్ బ్రహ్మ దక్షిణ తశ్చోత్తరేణ

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

అధశ్చోర్ధ్వం చ ప్రసృతం
బ్రహ్మైవేదం విశ్వమిదం వరిష్ఠం ॥

ఉన్నదంతా, అంతటా ఎల్లప్పుడూ ఉంటున్న అమరత్వమైన బ్రహ్మస్వరూపమే. తూర్పు, పశ్చిమాలంతా, ఉత్తర, దక్షిణాలంతా సర్వకాలాల్లో బ్రహ్మమే సర్వ వ్యాప్తమై ఉజ్జ్వలంగా ప్రకాశిస్తూ ఉన్నది. యదార్థంగా ఈ జగత్తంతా సర్వోత్కృష్టమైన ఆ బ్రహ్మ స్వరూపమే.

మన యదార్థ స్వరూపమైన ఈ బ్రహ్మ స్వరూపస్థితి మనకు ఎలా సంప్రాప్తమౌతుంది? ఇది ప్రయత్న సాధ్యం కాకపోవడం వల్ల, దీనికోసం ప్రయత్నించడ మనేది సంభవం కాదని శంకర భగవత్పాదులు విశదపరిచారు. ఎందుచేతనంటే, మనమే ఆ చైతన్యానందమైన బ్రహ్మస్వరూపుల మైనందున-ఇక మనం ప్రయత్నించడానికి ఆ బ్రహ్మస్వరూపం వేరే ఎక్కడుంటుంది? నాచుతో కప్పబడి వున్న చెరువులోని నీటిని కోరేవాడు ఆ నాచును తొలగిస్తే స్వచ్ఛమైన మంచినీళ్ల ప్రాప్తిస్తాయి. అలాగే ఇంద్రియాలకు గోచరించే అవిద్యా పరికల్పితమైన నామరూపాలన్నింటినీ మిథ్యాస్వరూపాలని ఉపేక్షిస్తే, తానే స్వతః సిద్ధమైన బ్రహ్మస్వరూపుడుగా భాసిస్తూంటాడు. అప్పుడు చిత్తం విషయరాహిత్యాన్ని పొంది చైతన్య స్వరూపమైన మహదానంద సముద్రంతో ఏకమౌతుంది ఇక సంసార భయ దుఃఖాలేవీ దరికి రావు. వాటినుండి విముక్తి కలిగి, ఎప్పుడూ ఆ చైతన్య మహావైభవంలోనే స్థిరత్వం పొందుతాడు. ఇలాంటి మహాపురుషుణ్ణి గురించి ముండకోపనిషత్తులో వివరిస్తూ చెప్పబడింది:

యదావశ్యః పశ్యతే రుక్మవర్ణం
కర్తార మీశం పురుషం బ్రహ్మయోనిం
తదా విద్వాన్ పుణ్య పాపే విధూయ
నిరం జనః పరమం సామ్యముపైతి ॥

అంటే, స్వయం జ్యోతి రూపమై బ్రహ్మకంటె కూడా ఆదియై, సర్వజగత్తుకూ ఆధారమై, ఈశ్వరుడైన ఆ పరమాత్మను ఎవరు సాక్షాత్కరించుకుంటారో,

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

ఆలాంటి విద్వరీషులైన మహనీయులు, పుణ్య పాపాలకు అతీతులై నిరంజనము, మహావైభవోపేతము, సర్వోత్కృష్టము అయిన ఏకత్వాన్ని పొందుతారు. సమస్తమూ తామే అయి భాసిస్తారు. స్వప్నసమానమైన ద్వైత భావమంతా సమసిపోయి, ఆద్వైత చైతన్య మహానంద వైభవంతో విలసిల్లుతారు.

అజ్ఞానాన్ని నశింపజేసి ఈ పరతత్వాన్ని యోగవాశిష్ఠంలో శుక్రాచార్యుడు బలి చక్రవర్తికి సూక్ష్మంగా ఇలా ప్రబోధిస్తాడు:

చిదిహాస్తి హి చిన్మాత్రమిదం చిన్మయ మేవచ
చిత్త్వం చిదహమేతే చ లోకాశ్చితి సంగ్రహాః॥

ప్రపంచమంతా చైతన్యమే. చైతన్యమయమైన ఈ జగత్తంతా కేవలం చైతన్యమాత్రమే. ఇదంతా చైతన్యమే అయి వుంది. నీవూ, నేనూ చైతన్య స్వరూపులమే. చిద్రూపులం. ఈ భువన భాండారములన్నీ చిద్రూపములే. సమస్త ప్రబోధల యొక్క సారాంశం ఇదే.

చిచ్చేత్య కలనా బన్ధస్తన్ముక్తి ర్ముక్తి రుచ్యతే
చిద చేత్యాఖిలాత్మేతి సర్వసిద్ధాంత సంగ్రహః

చైతన్యము యొక్క భ్రాంతి జనితమైన విషయకల్పనయే బంధము. ఆ భ్రాంతి కల్పనా రాహిత్యమే మోక్షము. విషయరహితమైన చైతన్యమే పరమాత్మ. సమస్త వేదాంత సిద్ధాంతసార సంగ్రహం ఇదే.

మనవి

శ్రీ శంకర కృపకు వార్షిక చందాలను పోస్టు ద్వారా పంపించదలచుకున్నవారు ప్రకాశకుని చిరునామాకు పంపవలెను. గడువు తీరు నెల పత్రికపై వ్రాసియుంటుంది. ఆది గమనించి వెంటనే చందా పంపకోరుచున్నాము.

యం. వి. శేషగిరి
శంకరకృప ప్రకాశకుడు,
ఇ. నెం. 2-2-1180/19/1/8,
న్యూనల్లకుంట

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

శ్రీ గురుభ్యో నమః

'జీవన్ముక్తుడు'

పరమహంస పరివ్రాజకాచార్య

శ్రీ అద్వయానంద భారతీస్వామి

(గత సంచిక తరువాయి)

జీవన్ముక్తి విదేహముక్తి పూర్వమే :

సాధక పురుషునికి ఆత్మజ్ఞాన (సమ్యగ్దర్శన) క్షణప్రభృతి వర్తమానారబ్ధ దేహనాశ పర్యంతము జీవన్ముక్తి. ఆ తరువాత నిరవధికమైన విదేహముక్తి. ఈ అభిప్రాయమునే యీ క్రింది శ్రుతిస్మృతులు చెప్పుచున్నవి.

"తదధీషికాతూల మగ్నౌప్రోతం ప్రదూయేతైవం హాస్యసర్వే పాప్మానః ప్రదూయంతే" ఛాం. ఉ. 5-24-3.

"యథాపుష్కరపలాశ ఆపోనశ్లిష్యంత ఏవ మేవం విధి పాపంకర్మ నశ్లిష్యతే" బృ. ఉ. 4-14-3.

"ఉభే ఉహైవైన ఏతేతరతి" బృ ఉ. 4-4-22.

"తదధిగమ ఉత్తరపూర్వాఘయోర సంశ్లేష వినాశౌతద్వ్యప దేశాత్" బ్ర. సూ. 4-1-13.

"ఇతరస్యాప్యేవ మసంశ్లేషః పాతేతు" బ్ర. సూ. 4-1-14.

ఈ సారాంశమునే శ్రీ భగవత్పాదులవారు ఉపదేశ పంచకమున చివరి శ్లోకమునందు చెప్పిరి.

"ప్రాక్కర్మ ప్రవిలాప్యతాం చితిబలానాప్యుత్తరై శ్లిష్యతామ్
ప్రారబ్ధం త్విహ భుజ్యతా మథ పరబ్రహ్మాత్మనా స్థీయతామ్"

జీవన్ముక్తి విదేహముక్తికంటె పూర్వమైనదనియు శ్రుతిస్మృతులు.

"ఆచార్యవాన్ పురుషోవేద తస్యతావ దేవచిరం యావన్నవిమోక్ష్యేఽథ సంపత్స్యే" (ఛాం. ఉ. 6-14-2)

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

"దేహత్రయాతి రిక్తోహం శుద్ధచైతన్య మస్మ్యహమ్. బ్రహ్మాహమితి యస్యాంత స్సజీవన్ముక్త ఉచ్యతే" (తేజబిందు ఉ. 4)

"భిద్యతే హృదయగ్రంథిః ఛిద్యంతే సర్వసంశయాః. క్షీయంతే చాస్య కర్మాణి తస్మిన్ దృష్టే వరావరే" (ముం. ఉ. 2-2-8; యోగశిఖా ఉ. 6; ఆన్న 4)

"జీవన్ముక్తి పదంత్యక్త్వా స్వదేహే కాలసాత్కృతే విగత్య దేహముక్తత్వమ్" (పై. ఉ. 3; మహా.ఉ 2; యోగకుం 3; ముక్తి ఉ. 2)

జీవన్ముక్తులను ద్వివిధముగా జీవన్ముక్తి వివేకమున (చిత్రదీపాంతమున) శ్రీ విద్యారణ్యులు చెప్పిరి. బ్రహ్మలోకమును కూడ తృణీకరించునంతటి వైరాగ్యము, గాఢసుషుప్తి తుల్యమైన సమాధినిష్ఠ, బ్రహ్మసాక్షాత్కారము అనునవి మూడును కలిగిన జీవన్ముక్తుడు జీవన్ముక్త స్థితి పరాకాష్ఠను అధిగమించిన బ్రహ్మవిద్వరిష్ఠుడే. ఇతనికి జీవన్ముక్తి మొదటి విధము. రెండవ విధ జీవన్ముక్తుడు సమ్యగ్దర్శనము పొందియు దురారబ్ధ వశమున వైరాగ్య ఉపరతులు పండక పోవడము వలన లౌకిక వైదిక లోకవ్యవహారకృత దుఃఖములు వెంటబడియుండినవాడు.

దీనికి ప్రమాణములు :

"వైరాగ్యబోధోప రమాస్సహాయాస్తే పరస్పరమ్. ప్రాయేణ సహవర్తంతే వియుజ్యేతే స్త పనఃఫలమ్" (చిత్రదీపము)

"త్రయోప్యత్యంత పక్వాశ్చ న్మహితస్తుః ఫలమ్" "పూర్ణేబోధే తదన్యేద్యే ప్రతిబద్ధా యదాతదామోహో వినిశ్చితః కింతు దృష్టదుఃఖం న పశ్యతి" (వె. పం. 7-276, 282, 284 శ్లో.)

జీవన్ముక్తులు మూడు విధములుగ నున్నారని మరియొక పద్ధతి :

(1) లోకవ్యవహార ప్రధానులు, (2) వివేకప్రధానులు, (3) సమాధి ప్రధానులు.

రాజ్యాధికారాది ఆరబ్ధ వశమున హర్షశోకములు తప్పనివారు వ్యవహార ప్రధానులు. ఆరబ్ధకర్మవశాత్ వచ్చిన హర్షశోకములందు మిథ్యాత్వాను సంధాన వివేకులై హర్షశోకములకు లోనుకాని జీవన్ముక్తులు వివేక ప్రధానులు, హర్ష

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

శోక ప్రసక్తిలేని నిరంతర నిర్వికల్ప సమాధియందు అఖండానందాత్మానుభవముతో యుండువారు సమాధి ప్రధానులు. తైత్తిరీయ ఉపనిషద్భాష్య భూమిక (శిష్టావల్యారంభము) యందీ వివరణమున్నది.

యోగవాసిష్ఠమునందు శాంకర సర్వసిద్ధాంతసార సంగ్రహమునందు మహోపనిషత్తునందు వరాహోపనిషత్తునందు చెప్పబడిన సప్తజ్ఞాన భూమికలో చివరి నాలుగు బ్రహ్మవిత్ (సత్త్వాపత్తి) బ్రహ్మవిద్వర (అసంసక్తి) బ్రహ్మవిద్యరీయ (పదార్థభావినీ) బ్రహ్మవిద్వరిష్ఠులు (తుర్యగా) జీవన్ముక్తులే.

సామాన్యముగా చెప్పవలసినచో జీవన్ముక్తులు సమాధినిష్ఠులు, వ్యవహార నిష్ఠులు అని రెండు విధములుగా నున్నారని యనవచ్చును. సమాధినిష్ఠులు, వరా, వరీయ వరిష్ఠులని మూడు విధములుగా నుందురని, వ్యవహార నిష్ఠులందు కూడ లౌకిక అశాస్త్రీయ వ్యవహారులు, లౌకికశాస్త్ర వ్యవహారులు, వైదిక వ్యవహారులు అని మువ్విధముగా నుందురని చెప్పవచ్చును.

మరియొక విధముగా చూచినచో 1. అశాస్త్రీయ లౌకిక వ్యవహారులు, 2. శాస్త్రీయ లౌకిక వ్యవహారులు, 3. వైదిక వ్యవహారులు, 4. సహజోత్థాన సమాధిపరులు, 5. పరనిమత్తోత్థానపరులు, 6. ఉత్థానరహిత సమాధిపరులు అని ఆరు విధములుగా జీవన్ముక్తులున్నారని తోచుచున్నది. జీవులు అనంత విధములుగా నున్నట్లే జీవన్ముక్తులు అనంత విధములుగ నున్నారనియే చెప్పతగును. మహోపనిషద్భాష్యమువలన పశువశ్యాదులందును జీవన్ముక్తులున్నారని చెప్పబడినది.

ఈ పైన చెప్పిన ఆరు విధములవారికిని జన్మరాహిత్యమున్నప్పటికి, ఉత్తరోత్తర కక్ష్యలవారు పూర్వపూర్వ కక్ష్యల వారికంటె అధికమగు జీవన్ముక్తానందాతిశయము కలవారనవలెను. జీవన్ముక్తుని లక్షణములు, వరాహోపనిషత్తులోను మహోపనిషత్తులోను అధ్యాత్మోపనిషత్తులోను తేజోబిందు ఉపనిషత్తులోను చెప్పబడినవి. (సశేషము)

Sri Vidyabharathi Book Centre, Sringeri

 CC-O. In Public Domain. Digitized by eGangotri

శ్రీ గాయత్రీ శంకర భాష్యము

(ఆంధ్ర వివరణ సహితము)

రచయిత : ప. ప. శ్రీశ్రీ చిదానంద భారతీస్వామి, పుటలు 191, వెల : 20 రూ లు; ప్రకాశకులు : శ్రీ సీతారామ ఆదిశంకర ట్రస్టు, ఇ. నెం. 24-141, ఆనంద్‌బాగ్, మల్కాజ్‌గిరి, హైదరాబాద్-500 047.

"నగాయత్ర్యాః పరోమన్త్రోః నమాతుః పరదైవతమ్" ఈ మాట అందరికి తెలిసిన విషయమే. గాయత్రీ మంత్రజపము వలన అనేక ఫలితములు లభించునని శాస్త్రము చెప్పుచున్నది అట్టి గాయత్రీ మంత్రమునకు శంకరభాష్యము కలదు. దానిని తెలుగువారికి అందజేయవలెననెడి ఉద్దేశ్యముతో వ్రాయబడిన గ్రంధమిది. శంకరభాష్యముతోపాటు, ఉపనిషత్తుల యందు, పురాణములయందు ఇతర గ్రంథములయందు గాయత్రీ మంత్రము గురించి ఉన్న విషయములను సేకరించి అందించిన గ్రంధమిది.

గాయత్రీ మంత్రము గురించి, ఇదివరలో ఎన్నో గ్రంధాలు వచ్చాయి. అయినా చెప్పవలసిన విషయాలు అనంతం. అందువలన ప్రతి ప్రయత్నాన్ని ఆహ్వానించవలసినదే. రచయితతోపాటు ప్రకాశకులు కూడ అభినందనీయులే.

స్వీకారం

1) లలితా స్తోత్రమంజరి; సంకలనం : శ్రీ పురాణపండ రాధాకృష్ణ మూర్తి; వెల : 8 రూ.లు ప్రతులకు : శ్రీమతి కుందుర్తి కనకదుర్గ, ఆర్ష ధర్మ గ్రంధాలయం, గుజ్జంవారి వీధి, ఒంగోలు-523 001. ఇందులో శ్రీ లలితా ప్రాతఃస్మరణ స్తోత్రమ్, శ్రీ లలితాసహస్రనామ స్తోత్రమ్, శ్రీ లలితా త్రిశతీ స్తోత్ర రత్నమ్, శ్రీ దేవీ ఖడ్గమాలా స్తోత్ర రత్నమ్, శ్రీ శివస్తోత్రమ్, శ్రీ దేవ్యపరాధ స్తోత్ర రత్నమ్ ఉన్నాయి.

2) సౌందర్యలహరి - అనువాదం : శ్రీ పురాణపండ రాధాకృష్ణమూర్తి; వెల : 8 రూ లు, ప్రతులకు : శ్రీమతి కుందుర్తి కనకదుర్గ, ఆర్షధర్మ గ్రంధాలయం, గుజ్జంవారి వీధి, ఒంగోలు-523 001. శ్రీ శంకర భగవత్పాద విరచిత సంస్కృత మూలశ్లోకాలు, లఘుటిక ఉన్నాయి.

3) జ్యోతిశ్శాస్త్ర ప్రాశస్త్యము (సూర్యకిరణ ప్రభావ సహితము) - శ్రీ ముక్తి నూతులపాటి గోపాలకృష్ణశాస్త్రి విరచితం, వెల : రు. 2-50 లు;

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

ప్రతులకు : శ్రీమతి కుందుర్తి కనకదుర్గ, ఆర్ష ధర్మ గ్రంధాలయం, గుట్టంవారి వీధి, ఒంగోలు-528 001. ఇందు జ్యోతిశ్శాస్త్రము యొక్క ప్రాశస్త్యము వివరింపబడినది. అనుబంధముగ సూర్యకిరణ ప్రభావము అనే శీర్షికతో ఆదిత్య మహిమ, సూర్యుని నామములు, కిరణ విశేషములు, సూర్యోపాసనము మొదలగు విషయములు చేర్చబడినవి.

4) శ్రీ రామకృష్ణ ప్రధాన శిష్యవర్గము; అనుసరణ - కూర్పు : డా॥ పన్నాల శ్యామసుందరమూర్తి; వెల : 5 రూ.లు; ప్రతులకు : శ్రీమతి కుందుర్తి కనకదుర్గ, ఆర్షధర్మ గ్రంధాలయం, గుట్టంవారి వీధి, ఒంగోలు-528 001. శ్రీ రామకృష్ణ పరమహంసను ఆశ్రయించి, ఆధ్యాత్మిక సాధన చేసిన ప్రధాన శిష్యులు పదహారుగురు వాస్తవానికి వారిలో కొందరికి శ్రీ రామకృష్ణునితో సాంగత్యం ఎక్కువగా కూడ లేదు. అయినా స్వల్పకాలంలోనే వారి ప్రభావానికి లోనయ్యారు. ఆ పదహారు మంది జీవిత చరితలో ఉన్నాయి. వారి పేర్లు స్వామి వివేకానంద, స్వామి బ్రహ్మానంద, స్వామి యోగానంద, స్వామి నిరంజనానంద, స్వామి ప్రేమానంద, స్వామి శారదానంద, స్వామి రామకృష్ణానంద, స్వామి శివానంద, స్వామి అఖండానంద, స్వామి విజ్ఞానానంద, స్వామి సుబోధానంద, స్వామి అభేదానంద, స్వామి త్రిగుణాతీతానంద, స్వామి తురీయానంద, స్వామి అద్భుతానంద, స్వామి ఆద్వైతానంద

శృంగేరి వార్తలు

అవిచ్ఛిన్న పరంపర

ఇదివరలో 'శృంగేరి పిలుపు' అనే పేరుతో ఒక వీడియో క్యాసెట్టు విడుదలై, ఆస్తిక జనులను విశేషంగా ఆకర్షించిన సంగతి తెలిసినదే. దానికి తరువాయిగా 'అవిచ్ఛిన్న పరంపర' అనే పేరుతో మరో వీడియో క్యాసెట్టును విడుదల చేస్తున్నారు.

ఇందులో శ్రీ శంకర భగవత్పాదులు అవతరించిన నాటి పరిస్థితులు చతురామ్నాయ మఠ స్థాపన, శ్రీ శృంగేరీ శారదాపీఠ అవిచ్ఛిన్నగురు పరంపర, శ్రీ జగద్గురు చంద్రశేఖర భారతీ మహాస్వాముల వారు పీఠాధిపతులుగా ఉన్నప్పటి దృశ్యములు, శ్రీ జగద్గురు అభినవ విద్యాతీర్థ మహాస్వాముల వారు పీఠాధిపతులుగా ఉన్నప్పటి దృశ్యములు, శ్రీజగద్గురు భారతీతీర్థ మహాస్వాముల వారి పీఠారోహణ మహోత్సవ దృశ్యములు అక్టోబరు 19వ తేదీనాడు శ్రీవారు తమ

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

అభినందన సభలో చేసిన అనుగ్రహ భాషణము ఉన్నాయి. 'శృంగేరి పిలుపు'అనే క్యాసెట్టును తయారుచేసిన బృందమే దీనిని తయారు చేసింది. ఫిబ్రవరి 15 వ తేదీ నాటికి సిద్ధంగా ఉండే ఈ క్యాసెట్టులో వ్యాఖ్యానం ఆంగ్లంలో కాని, తమిళంలో కాని, కన్నడంలో కాని, తెలుగులోకాని హిందీలోకాని ఉంటుంది. అంటే క్యాసెట్టును తీసుకునేవారు ఎంచుకున్న భాషలో ఉంటుంది. 'శ్రీ శృంగేరి జగద్గురు శంకరమఠం, టి. నగర్ మద్రాసు'కు 500 రు. లు విరాళమిచ్చే వారికి ఈ క్యాసెట్టు ఉచితంగా పంపబడుతుంది. విరాళములు పంపవలసిన చిరునామా శ్రీ కె. యన్. విశ్వనాథన్, కార్యదర్శి, శ్రీ శృంగేరి జగద్గురు శంకరమఠం, టి. నగర్, 59, హబిబుల్లారోడ్, టి. నగర్, మద్రాసు - 600 017. డిమాండ్ డ్రాఫ్టు ద్వారా మాత్రమే విరాళములు పంపవలెను. ఏ భాషలో వ్యాఖ్యానము కావలెనో ముందుగానే వ్రాయవలెను.

'శంగేరి పిలుపు' క్యాసెట్టు కూడ 500 రు.ల విరాళమునకు దొరుకుతోంది. ఆది కావలసినవారు తమకు ఏ భాషలో వ్యాఖ్యానం కావాలో వివరిస్తూ పై చిరునామాకే డిమాండ్ డ్రాఫ్టు రూపంలో విరాళం పంపాలి. గురు పరంపర స్తోత్రాలతోనూ, మరికొన్ని యితర స్తోత్రాలతోనూ ఆడియో క్యాసెట్టు కూడ తయారయింది. ఈ మూడు క్యాసెట్లకు సంగీతాన్ని శ్రీ భాగవతుల సీతారామశర్మ సమకూర్చారు. ఈ ఆడియో క్యాసెట్టు 60 రు.లు విరాళం శ్రీ శృంగేరి జగద్గురు శంకరమఠం, టి. నగర్‌కు పంపిన వారికి ఉచితంగా పంపబడును.

పంచాంగ విశేషములు

(శ్రీమఠ పంచాంగము ననుసరించి)

ఖర్కనామ సంవత్సర మాఘమాస శుద్ధ పంచమీ (1-2-1990) నుండి ప్రమోదనామ సంవత్సర చైత్రమాస శుద్ధ పంచమీ (31-3-1990) వరకు.

1-2-1990 నుండి 28-2-1990 వరకు గల పంచాంగ విశేషములు గతనెల సంచిన యందున్నవి.

మార్చి నెల

6-3-1990 మొదటివారము ఫాల్గుణ శు॥ స పంచమీ, శ్రీ శృంగేరిలో శ్రీ దుర్గాంబా రథోత్సవము.

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

7-3-1990 బుధవారము ఫాల్గుణ శు॥ ఏకాదశీ అమలకీ ఏకాదశీ

8-3-1990 గురువారము ఫాల్గుణ శు॥ ద్వాదశీ నృసింహ ద్వాదశీ

9-3-1990 శుక్రవారము ఫాల్గులు శు॥ త్రయోదశీ కామదహనం.

11-3-1990 ఆదివారము ఫాల్గుణ శు॥ పౌర్ణిమా బ్రహ్మ సావర్ణిక మన్వాది, వసంతోత్సవము, హోళికోత్సవము.

14-3-1990 బుధవారము ఫాల్గుణ బ॥ తదియా మీన సంక్రాంతి, బ్రహ్మ కల్పాది.

17-3-1990 శనివారము ఫాల్గుణ బ॥ షష్టి, శ్రీ శృంగేరి శ్రీ జగద్గురు అభినవ సచ్చిదానంద భారతీ మహాస్వామి పరాపర గుర్వారాధన.

22-3-1990 గురువారము ఫాల్గుణ బ. ఏకాదశీ, విజయా ఏకాదశీ, గురువారైకాదశీ వ్రతము శ్రీ శృంగేరి శ్రీ జగద్గురు సచ్చిదానంద శివాభినవ నృసింహ భారతీ మహాస్వామివారి జయంతి.

24-3-1990 శనివారము ఫాల్గుణ బ. త్రయోదశీ, శనిత్రయోదశీ.

25-3-1990 ఆదివారము ఫాల్గుణ బ. చతుర్దశీ మాసశివరాత్రి.

26-3-1990 సోమవారము ఫాల్గుణ బ. అమావాస్యా, సోమావాస్యా, పద్మక యోగం, ద్వాపరయుగాది, అజపాదామావాస్యా.

27-3-1990 మంగళవారము చాంద్రమాన ప్రమోదనామ సంవత్సరాది. చైత్ర మాస శు. పాడ్యమి, శ్వేతవరాహకల్పాది. తైలాభ్యంగం, నింబ కుసుమ భక్షణ, పంచాంగశ్రవణం, వసంత నవరాత్రారంభము, శ్రీ శృంగేరిలో శ్రీరామ వసంత నవరాత్రోత్సవములు, శ్రీ శృంగేరి జగద్గురు సచ్చిదానంద శివాభినవ నృసింహ భారతీ స్వామ్యాఖ పరమ గుర్వారాధన.

29-3-1990 గురువారము చైత్ర శు తదియ ఉత్తమ మన్వాది. సౌభాగ్య గౌరీవ్రతం, సౌభాగ్య శయన వ్రతము, మాసగౌరీ వ్రతం, శివ డోలోత్సవము, తిథిద్వయం గణేశపూజా.

30-3-1990 శుక్రవారము చైత్ర శు చవితి పంచమాతిథి కూర్మకల్పాది శ్రీ పంచమీ.

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

గురుర్‌బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్ పరంబ్రహ్మ తస్మై శ్రీగురవేనమః

శ్రీ శృంగేరి జగద్గురు పీఠాధిపతులు

శ్రీ భారతీతీర్థ సన్నిధానము వారల

చరణ చరణాంబుజములకు ప్రణామము

S. P. REDDY

Managing Director

హైద్రాబాదు సిలిండర్స్ ప్రై. లిమిటెడ్

యల్. పి. జి. గ్యాస్ సిలిండర్ల మాన్యుఫాక్చరర్స్

ఆఫీసు :

షాప్ నెం. 12, ఆర్. బి. వి. ఆర్. రెడ్డి హాస్టల్,
షాపింగ్ కాంప్లెక్స్ తిలక్ రోడ్డు
హైదరాబాదు - 500 001 ఫోను : 285047

ఫ్యాక్టరీ :

నందిగాం గ్రామం
షాద్‌నగర్ తాలూకా
మహబూబ్‌నగర్ జిల్లా (ఆం. ప్ర)

Printed and Published by M. V. Seshagiri, at Sringeri Sankara Mutt, University Road Nallakunta Hyderabad - 500 044,
Printed at Sri Lakshmi Venkateswara Power Press Himayatnagar Hyderabad ; Editor T. Harihara Sarma

Sringeri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్ పరంబ్రహ్మ తస్మై శ్రీ గురవేనమః

Our Humble Pranamams to

SRI BHARATHI THEERTHA SANNIDHANAM

Sri Jagadguru Sankaracharya

of

Dakshinamnaya Sri Sringeri Sarada Peetham

R. D. SARMA
Chief Executive

M/s. RAMNATH & Co.

Distributors of Chemicals, Solvents & Acids

Phones : { Off. : 844852 / Res. : 840729 } Grams : RANAKEMDYE

1-8-156/160, Plot No. 10
Prenderghast Road, Secunderabad - 3.

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-0. In Public Domain. Digitized by eGangotri

Regd. No. 17726/55 H/RSE 480 SRI SANKARA KRUPA

FEBRUARY 1990

To

.....

.....

.....

.....

ఈ సంచికలో

శ్రీ శంకర భగవత్పాదాచార్య విరచిత సౌందర్యలహరి	1
శ్రీ జగద్గురు అభినవ విద్యాతీర్థ మహాస్వామి చరణుల ఉపదేశము	2
శ్రీ జగద్గురు భారతితీర్థస్వామి చరణుల ఉపదేశము	5
శతశ్లోకి	8
శంకర విజయధ్వజము	11
మనమూ - మన మతమూ	14
చైతన్య మహాప్రభవం	19
జీవన్ముక్తుడు	25
పుస్తక సమీక్ష	28
శృంగేరి వార్తలు	29
పంచాంగ విశేషములు	30

If undelivered please return to :
Shri M. V. SESHAGIRI
Publisher : Sri Sankara Krupa,
H. No. 2-2-1130/19/1/3, New Nallakunta, Hyderabad-44.

Sri Vidyabharathi Book Centre, Sringeri